కాంగ్రెసు తమ యెన్నికల ప్రచారాన్ని యే విధంగా సాగిస్తున్నదా? అనేది చాలామందికి సమస్యగా వుంది—ఒక్కటి మాత్రం వ్యక్త మౌతోంది. మునుపటిలాగా యీసారి ప్రణాళికలను యేకరువు పెట్టడం లేదు. దొడ్డిదారిన పోయి ప్రజల్ని మాయజేయ ప్రయత్నిస్తున్నారు. గ్రామనాయకులతో వారు రహస్యంగా చేసికొంటున్న కాంట్రాక్టు ఏమని ఆలోచిస్తే- "ఈసారి కూడా కాంగ్రెసు కొద్దో, గొప్పో మెజారిటీతో అధికారానికి తప్పనిసరిగా వస్తుంది. మీ మాటలోవున్న ఓట్లన్నీ మాకు యిప్పిస్తే మీ ప్రాంతానికి గొప్ప మేలు కలుగుతుంది. ఈ విషయం మిగతావాళ్లతో చెప్పకుండా మధ్య పుచ్చి మీ ఓట్లు మా పెట్టెలో వేయించండి"

ఇదే ప్రచారం అన్నిచోట్లా జరుగుతోంది. కాబట్టి ఓటర్లకు నా మనవేమంటే గ్రామ పెద్దల బూటకపు మాటలకు లొంగి గుడ్డిగా మీ ఓట్లను దుర్వినియోగం చేసికోకండి. ఒక వేళ కాంగ్రెసు అధికారంలోనికి వచ్చినా ఎంత హెచ్చుమంది ప్రత్యర్థులను గెలిపించుకొంటే అంత మంచిది. అధికారంలోవున్న పార్టీకి బలమైన ప్రతిపక్షం శాసన సభలో లోపించి నట్లయితే, ప్రభుత్వం ఏంచేసినా నోరుమెదపకుండా కూర్చోవలసినదే తాము వోటు చేసే టప్పుడు వోటర్లు యీ రహస్యాన్ని గురించి యోచించవలసిందిగా హెచ్చరిస్తున్నాను. కాని పక్షంలో రాబందుల ప్రభుత్వమే మనకు ప్రత్యక్ష మౌతుంది.

# చిన్నతనపు మమకారం

"శ్రీ విరించి"

కొడుకును బడికి పంపే ప్రయత్నంలో తీవ్రంగా పనిచేస్తూంది లక్ష్మమ్మ గారు. గోవిందానికి చిరాగ్గావుంది. శనివారం, ఆదివారం పూర్తిగా స్వేచ్ఛను అనుభవించి, తిరిగి సోమవారంనాడు యథాప్రకారం స్కూలుకు వెళ్ళాలంటే, యే కుర్రవాడికైనా అయిష్టంగానే వుంటుంది కొంత. అదికాక మరొక విశేషం జరిగింది. జరిగిపోయిన శుక్రవారం మధ్యాహ్నం, లక్ష్మమ్మగారింటికి చుట్టాలు వచ్చారు. వాళ్లు ఎవరయిందీ తెలుసుకోటానికి గోవిందం యేమీ బిడియపడకుండానే, వచ్చిన యిద్దరు మగపిల్లల్తోనూ, ఒక్క అమ్మాయి తోనూ ఆటల్లోనికి దిగిపోయినాడు. వాడినీ రెండు రోజులూ చదువుకోమని హెచ్చరించిన వాళ్లూ లేరు. తండ్రి వూళ్ళో వుండడు గదా! తల్లి అతిథులకోసం ఏమేమో చేస్తోనే వుంది. కావలసినవాళ్లు వస్తే ఒక్క క్షణం లక్ష్మమ్మ గారి చెయ్యి వూరికే వుండదు. పిండివంటలనో, పేరంటాలనో యేదో పెటకం పెడుతుంది.

"తెల్లవారింది మొదలు పొద్దెక్కుతూనే వుంటుంది. నా పనే నాకు తెమలకుండావుంటే ఇక నిన్ను ఎక్కడ మేల్కొల్పేది?" అంటున్న దావిడ. యుద్ధానికి వెళ్ళే సిపాయిలా తయారయాడు చివరకు గోవిందం, కాని ఆ గంభీరం, నిక్కు మాత్రం లేవు.

గోవిందం ఆలోచన మరొక దృక్పథంలో పనిచేసింది. ఈ చుట్టాలనబడేవాళ్లు యింకా వుండేది రెండు రోజులే. ఈ రెండురోజులూ తనూ యింట్లోనేవుండి, పూర్తి ఆనందాన్నీ, హాయినీ అనుభవిస్తే ప్రమాదం ఏమిటి? మహా అయితే పాఠాలు నష్టం. తనేం యెమ్మే, బీయే కాదుగా చదివేది. మొదటి ఫారమే గదా! రెండురోజుల పాఠాలు కలిపి రెండు గంటల్లో నేర్చుకోవచ్చు- వాళ్లు వెళ్ళిపోయింతర్వాత.

మరొక్క పిల్లవాడయితే యే తలనొప్పో లేక కాలినొప్పో అని వంకపెట్టి, స్కూలు యెగవేసేవాడు. కాని గోవిందం సూటిగా పోయేతత్వం కలవాడు. దొంగదారిన కాకండా, రాజపథాన్నే పోదామని చూస్తాడు! ఇదివరకు అనేక విషయాల్లో తల్లి కాదన్న పని చేయటం యిష్టంలేక మళ్ళీ ఆపని చెయ్యాలనీ, తను నిలవలేక- ఆపని సబబే అని ఆవిడచేత వప్పించి మరీ చేశాడు.

ఈ విషయం తల్లి ముందు యెట్లా ప్రారంభిస్తే యిదిగా వుంటుంది? అని ఒక క్షణం ఆలోచించాడు. "ఈరోజు బడికి వెళ్ళను" అన్నాడు చుట్టూ ఎవరూ లేకుండా చూచి, "ఏం?" అన్నదావిడ సాభిప్రాయంగా. హృదయంలోనించి పెల్లుబికివస్తున్న ఆవేదనతో తన చిన్నకోరికని వెలిబుచ్చాడు గోవిందం. కొడుకు మనస్సుని నొప్పించటం యిష్టంలేక, అయినా తప్పక, ఆమె అన్నది· "రెండురోజులు యిందుకనే నిన్ను నేను చదువు సంగతే యెత్తకుండా వదిలేశాను. పగలూ రాత్రీకూడా. ఇంకా ఎందుకు చెప్పూ? ఇందువల్ల నీకు ప్రత్యేకంగా లాభం లేకపోగా, నష్టంకూడా వున్నది. బడికి వెళ్ళి చివరి పీరియడ్ "మానాన్న రమ్మన్నారు" అని చెప్పి మాస్టారి సెలవు తీసుకొని వచ్చేయి. అంతేగాని రోజంతా...,"

గోవిందం మరేమీ మాటాడలేదు. సంచీ తీసుకుని బజారువ నడకసాగించాడు. వాడి లేత హృదయం మాత్రం దెబ్బతిన్నది. అయితే తను యెంతమాత్రం సరైన దారిలో వున్నాడో వితర్కించుకోనారంభించాడు వాడు దారిలో. తల్లి చెప్పిన మాటలు అక్షరాలా నిజంగా వాడికి గోచరించాయి. ప్రత్యేక లాభం ఏమివుంది? ఆడుకోటంవల్ల చదువును మించిన సదుపాయం యేమున్నది? రెండు రోజుల చదువు, తరవాత చెప్పించుకోవటంవల్ల ఆ నష్టం పూడినా దాదాపు తనకొచదువు అంటనట్టేలెక్క. పైగా హాజరుపోతుంది. సంవత్సరాంతంపోటీపరీక్షల్లో "హాజరు మొకటి బహుమానం" తనకు రావటానికి అవకాశం యెట్లావుంటుంది? మరొక పాయింటు వుంది. నాలుగు రోజులు ఆడుకున్నాక, వాళ్ళంతా వెళ్ళిపోతే యిల్లు చిన్నబోయే మాట నిజమే. తనకు బెంగ యేర్పడి, జ్వరంవచ్చినా రావచ్చు. ఈ దురవస్థనించి తప్పుకుందుకు రెండు రోజులు వాళ్ళతో ఆడుకుని ఆ ఆనందాన్ని చవిచూశాడు. కొద్దికొద్దిగా వాళ్ళనించి దూరం అవుతూవుండటం కన్నా మరొక ఉపాయం వుంటుందా?

బడిదగ్గరకొచ్చింది. వందలకొద్దీ పిల్లలు ఆవరణలో కేరింతాలు కొడుతున్నారు. ఇన్ని వందల మంది మధ్యకాక, ముగ్గురు పిల్లల్తో తను కాలం యెట్లా గడపగలడో వాడికి సిగ్గనిపించింది. బడి గంట కొట్టి అందరు పిల్లలూ తరగతి గదిలో చేరగా, మాస్టరువచ్చి హాజరు పట్టీ తెరుస్తూండగానే, గోవిందం తన యింటికి చుట్టాలువచ్చిన సంగతీ, ఆ పిల్లల్తో తను రెండు రోజులు యేకటాకీని ఆడుకున్న సంగతీ మర్చిపోయినాడు.

మధ్యాహ్నం భోజనానికి ఇంటికివచ్చాడు గోవిందం. అంత దూరంలో అతడిని చూచే, ముగ్గురు పిల్లలూ ఆనందంతో ఆట సరంజామా అంతా యేర్పాటుచేశారు. కాని వాళ్లకు గోవిందం తిరిగి బడకి వెడతాడని యేం తెలుసు? బడికి బయల్దేరుతూండగా, లక్ష్మమ్మగారు అడిగింది· "ఇంకో గంటన్నరలో వస్తావుగా?" తలవూపాడు. అకస్మాత్తుగా యీ సంగతి గుర్తు చెయ్యబట్టిగాని, కాకపోతే వాడు సాయంత్రం అంతా బళ్లోనే గడిపివచ్చి వుండేవాడు.

దీపాలవేళ భోజనం కానిచ్చి, పుస్తకాలు తెరిచాడు గోవిందం. చుట్టూ మూగిన ముగ్గురు పిల్లల్నీ పొమ్మని చెప్పటం వాడిచేత కాలేదు. ఆపని ఆ పిల్లల తల్లే చేసింది. "వాడిని చదువుకోనివ్వండి, మీరుపోయి వసారాలో మంచం వేశాను, పడుకుని కబుర్లు చెప్పుకోండి" అన్నది.

తెల్లవారింది మొదలూ, గోవిందం తన స్వంత పనిలోనే నిమగ్నుడయాడు. బడికి వెళ్ళనని వాడనటం గానీ, యేమాత్రమో తల్లి ఓదార్చటంగానీ, యేమీ జరగలేదు. మామూలుగా మధ్యాహ్నం భోజనానికి వచ్చి వెడుతున్నప్పుడు, వచ్చిన చుట్టాలంతా గోవిందాన్ని నిలేసి "ఇంకొక్క గంటలో మేమంతా వెళ్ళిపోతున్నాము. కులాసాగా చదువుకుని బుద్ధిమంతుడివవు. మళ్ళీ ఎప్పుడన్నా కల్సుకుందాం" అన్నారు. ముగ్గురు పిల్లల్నీ గోవిందం ఒక్కసారి కౌగలించుకున్నాడు. ఆ పిల్లల తల్లి ఇచ్చిన రూపాయి తన సత్ప్రవర్తనకు బహుమానంగా స్వీకరించాడు కూడా! బళ్ళో వున్నప్పటికీ వాడికి యింటి దగ్గిరే వున్నట్టనిపించిందా పూట.

ఆ సాయంత్రం గోవిందం యింటికి తిరిగి వచ్చేప్పటికి, వంటింట్లో లక్ష్మమ్మగారు తప్ప, అంత పెద్ద యింట్లోనూ మరొక్కరయినా లేకపోవటం కనిపించింది.